

## కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ఘన స్వాగతం

- రేపు ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరు కానున్న హైకోర్టు సీజేఎస్, సీఎం, మంత్రులు

02

అసెంబ్లీ సమావేశాల

## వ్యూహాలపై కసరత్తు

- గండిపేట రిసార్ట్‌లో గులాబీ నేతలు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

02



సంపుటి :03 | సంచిక :32 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

మంగళవారం 10, మార్చి 2026

## కేసీఆర్, కేటీఆర్ ను కలిసిన నాగుర్ల




03

## 13న పీఎం కిసాన్ జమ

- ఈ కేవైసీ, ఆధార్ సీడింగ్ తప్పనిసరి
- పూర్తి చేయని రైతులు త్వరపడండి

05



## సీపీఐలో చేరండి!

- మాజీ మావోయిస్టులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం.
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


05



## ఎస్సై యూపీఐకి 20 వేలు

- ఇసుక ర్యాంప్ యజమాని మొబైల్ నుంచి బదిలీ
- లావాదేవీకి సంబంధించిన స్క్రీన్ షాట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్
- డబ్బు ఎలా వచ్చిందో తెలియదని ఎస్సై వివరణ

02






# గ్యాస్ గండం

### ఎల్పీజీపై అంతర్జాతీయ ఉద్రిక్తలే కారణం

- దేశ వ్యాప్తంగా గ్యాస్ సంక్షోభం
- కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై తీవ్ర ప్రభావం
- సరఫరా లేక హోటల్ రంగం కుదేలు
- హైదరాబాద్‌లో వేలాది హోటళ్లు మూసివేత

02

- డొమెస్టిక్ సిలిండర్ సరఫరా సైతం ఆలస్యం
- రేషన్ పద్ధతిలో సరఫరా
- బంద్ బాటలో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి :** అంతర్జాతీయ యుద్ధ మేఘాలు భారత వంటగదిని కమ్మేశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి వద్ద నౌకల నిలిపివేతతో దేశవ్యాప్తంగా తీవ్ర గ్యాస్ సంక్షోభం నెలకొంది. దిగుమతులు స్తంభించడంతో కమర్షియల్ గ్యాస్ సరుకు అందక రాష్ట్ర రాజధాని సహా ప్రధాన నగరాల్లో వేలాది హోటళ్లు మూతపడే దిశగా వెళ్తున్నాయి. గృహ వినియోగదారులకు కూడా సిలిండర్ అందాలంటే వారం నుండి పది రోజులు వేచి చూడాల్సిన 'రేషన్' పరిస్థితి దాపురించింది. కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి ఉన్నత స్థాయి కమిటీని వేసినప్పటికీ, తక్షణ ఉపశమనం లభించక సామాన్యులు మళ్లీ కట్టెల పొయ్యి వైపు చూస్తున్నారు.

www.aksharadarbar.com
అక్షర దర్బార్ Voice of the people

# గ్యాస్ గండం

- అంతర్జాతీయ ఉద్రిక్తలే కారణం
- దేశ వ్యాప్తంగా గ్యాస్ సంక్షోభం
- కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై తీవ్ర ప్రభావం
- సరఫరా లేక హోటల్ రంగం కుదేలు
- హైదరాబాద్‌లో వేలాది హోటళ్లు మూసివేత
- డొమెస్టిక్ సిలిండర్ సరఫరా సైతం ఆలస్యం
- రేషన్ పద్ధతిలో సరఫరా
- బంద్ బాటలో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి**



హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కమర్షియల్ గ్యాస్ కొరత పరాకాష్టకు చేరింది. రాష్ట్ర రాజధానిలో సుమారు 6 వేల వరకు చిన్న, పెద్ద హోటళ్లు ఉన్నాయి. వీటిలో మెజారిటీ హోటళ్లు గ్యాస్ అందక సగం రోజు మాత్రమే పని చేస్తున్నాయి. ఇప్పటికే బెంగళూరు, ముంబై నగరాల్లో హోటళ్లు మూతపడగా, అదే పరిస్థితి వరంగల్,హైదరాబాద్‌లోనూ కనిపిస్తోంది. తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ మంగళవారం అత్యవసరంగా సమావేశమై రాష్ట్రవ్యాప్త బంద్‌పై కీలక చర్చలు జరిపింది. ఇ్‌సరఫరా వెంటనే పునరుద్ధరించకపోతే వేల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అసోసియేషన్ నేతలు హెచ్చరిస్తున్నారు. గ్యాస్ కొరత ప్రభావం కేవలం నగరాలకే పరిమితం కాలేదు. తెలంగాణలోని మారుమూల పల్లెలలోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా గ్రామాల్లో సిలిండర్ బుక్ చేసిన 24 గంటల్లోనే ఇంటికి వచ్చేది. కానీ ప్రస్తుతం ఈ సమయం వారం నుంచి 10 రోజులకు పెరిగింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో, నిల్వలను రేషనలైజేషన్ చేస్తున్నారు. అంటే ఉన్న గ్యాస్‌ను అందరికీ సమానంగా పంచడానికి డీలర్లు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల బుకింగ్ చేసినా సరే, పల్లెటూరి వినియోగదారులు సిలిండర్ కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## - కేంద్ర ప్రభుత్వం సమీక్ష

మంగళవారం మధ్యాహ్నం అందిన తాజా సమాచారం ప్రకారం, కేంద్ర పెట్రోలియం శాఖ ముగ్గురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గ్యాస్ కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన సరఫరా పెంచేలా చర్యలు తీసుకోనుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఇంకా తగ్గకపోవడంతో, ప్రత్యామ్నాయ మార్గాల్లో రష్యా నుంచి గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా కలెక్టర్ల నుంచి రోజువారీ నివేదికలు తెప్పించుకుని సమీక్షిస్తున్నది.

## - సంక్షోభానికి గల కారణాలు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా గ్యాస్ సంక్షోభం నెలకొంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద నౌకల రాకపోకలు స్తంభించాయి. ఇరాన్ ఈ ప్రాంతంలో నౌకలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల గ్యాస్ మోసుకెళ్లే ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఈ అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారత్‌లో ఎల్పీజీ కొరతకు కారణమవుతున్నది. ఎల్‌పీజీ అవసరాల కోసం మన దేశం 62 శాతం విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం సౌదీ అరేబియా, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వస్తుంది. అక్ ్డడి యుద్ధం వల్ల గ్యాస్ తీసుకువచ్చే నౌకలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. బయటకు వచ్చే నౌకల రవాణా ఖర్చులు పెరిగాయి. బీమా సంస్థలు బీమాను ఎత్తివేశాయి. దీంతో సరుకు చేరాల్సిన సమయం కంటే ఆలస్యమవుతోంది. దీంతో సంక్షోభం ఏర్పడింది. ప్రస్తుతం దేశీయంగా ఉత్పత్తి కేవలం 38 శాతం మాత్రమే ఉండటంతో, దిగుమతుల్లో స్వల్ప అంతరాయం కలిగినా , మరింత సంక్షోభం ఏర్పడే అవకాశం ఉంది.

## - గృహ వినియోగంపై పెరిగిన ఒత్తిడి

కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు (డొమెస్టిక్) ఇబ్బంది కలగకుండా గ్యాస్‌ను అత్యవసర సేవల చట్టం 'ఎస్మా' పరిధిలోకి తెచ్చింది. అయితే, కమర్షియల్ గ్యాస్ దొరకకపోవడంతో కొందరు వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్లను దొడ్డిదారిన వాడుతున్నట్లు సమాచారం అందుతోంది. దీనివల్ల సామాన్యులకు అందాల్సిన సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. ఫలితంగా సామాన్య గృహిణులు మళ్ళీ కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి జిల్లాల వారీగా కలెక్టర్లు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నగరాల్లో ఆటో రిక్షాలు పెద్ద సంఖ్యలో ఎల్‌పీజీపై నడుస్తున్నాయి. గత వారం రోజుల్లోనే ఆటో ఎల్‌పీజీ ధర లీటరుకు సుమారు 8 రూపాయల వరకు పెరిగింది. ఇప్పుడు లీటరు ధర రూ.63 చేరడంతో ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ స్టేషన్ల వద్ద గంటల తరబడి క్యూ కట్టాల్సి వస్తోంది. ధర పెరగడంతో ఆటో ఛార్జీలను కూడా పెంచక తప్పదని డ్రైవర్లు అంటున్నారు. ఇది చివరకు సామాన్య ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతోంది.



# అసెంబ్లీ సమావేశాల వ్యూహాలపై కసరత్తు

- గండిపేట రిసార్ట్ లో గులాబీ నేతలు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని గండిపేట గోల్కొండ రిసార్ట్‌లో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నిబంధనలు, రాజ్యాంగ అంశాలు, రూల్ బుక్ పై న్యాయకోవిదులు, రాజకీయ విశ్లేషకులతో అవగాహన కల్పించారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరత, అప్పుల బాధతో రైతుల ఆత్మహత్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సభలో ఏ విధంగా ఎండగట్టాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా మార్చి 20న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ప్రజాపక్షాన పోరాడేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన చమురు సంక్షేమం, హోటళ్ల బంద్ వంటి తాజా పరిణామాలను కూడా సభలో ప్రస్తావించాలని నిర్ణయించారు. ఈ వర్క్‌షాప్‌తో రానున్న సమావేశాల్లో ప్రభుత్వంపై దూకుడుగా వ్యవహరించేందుకు గులాబీ దళం పూర్తిస్థాయిలో కార్యాచరణ సిద్ధం చేసుకుంది.



# యువతకు ఉత్తమ శిక్షణ

- ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరదర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీ ద్వారా యువతకు ఉత్తమ శిక్షణ అందించి వారికి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఐటీసీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 2డీ, 3డీ మిషన్, అడ్వాన్స్డ్ సీఎన్‌సీ మిషన్, రోబోటిక్ వెల్డింగ్ మిషన్ మరియు ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించడం ద్వారా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ జమ్మూలాల్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైకి యూపీఐ ద్వారా రూ.20 వేలు ట్రాన్స్ ఫర్

- ఇసుక ర్యాంప్ యజమాని సెల్ నుంచి బదిలీ
- స్కీన్ షాట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్
- డబ్బు ఎలా వచ్చిందో తెలియదని ఎస్సై వివరణ

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు ఎస్సై మొబైల్‌కు ఒక ఇసుక ర్యాంపు యజమాని నగదు పంపిన ఉదంతం కలకలం రేపుతోంది. దుమ్మాతండా ఇసుక ర్యాంపు యజమాని అంగోత్ బాలకృష్ణ తన ర్యాంపు నుంచి ఇసుక రవాణా సాఫీగా సాగేందుకు స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు రూ.20 వేలు ఫోన్‌పే చేసినట్లు సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. డబ్బులు ఇస్తేనే రవాణా సాగుతుందని ఎస్సై ఒత్తిడి తెచ్చినట్లు సదరు యజమాని ఆరోపించిన స్క్రీన్‌షాట్లు సోమవారం నుంచి నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ వ్యవహారంపై ఎస్సై ప్రవీణ్ కుమార్ వివరణ ఇస్తూ.. తన వ్యక్తిగత నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి డబ్బులు వచ్చిన మాట నిజమేనని, అయితే వెంటనే వాటిని తిరిగి అదే నంబర్‌కు పంపించేశానని పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఇసుక ర్యాంపు యజమాని అని గుర్తించిన వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. గ్యాస్ కొరత, రైతుల ఆత్మహత్యలు వంటి వార్తల మధ్య పోలీసులకు ఫోన్‌పే ద్వారా డబ్బు ఆఫర్ చేసిన ఈ వింత ఉదంతం ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



# కొత్త గవర్నర్ కు ఘన స్వాగతం

- రేపు ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరు కానున్న హైకోర్టు సీజేఎస్, సీఎం, మంత్రులు

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ కొత్త గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లాకు మంగళవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెళ్లి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి డి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివ ప్రతాప్ శుక్లా గతంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. బుధవారం ఆయన తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్ భవన్‌లో జరగనున్న ఈ వేడుకలో హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు హాజరుకానున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ కావడంతో శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు.


నడికుడలో కేక్ కట్ చేస్తున్న నాగుర్ల అభిమానులు


దుగ్గొండిలో కేక్ కట్ చేస్తున్న ఆరె కుల సంక్షేమ సంఘం నేతలు


నాగూర్లకు బర్త్ డే విషెష్ చెబుతున్న కేటీఆర్



# ఘనంగా నాగుర్ల జన్మదిన వేడుకలు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

## రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

అక్షర దర్బార్, పరకాల : పరకాల నియోజకవర్గంలో తెలంగాణ రైతు రుణ విమోచన మాజీ చైర్మన్, ఫర్టిలైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు నాగుర్ల వెంకటేశ్వర్ల జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరకాల పట్టణంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేశారు.అలాగే నడికూడ మండల కేంద్రంతో పాటు ఆయన జన్మస్థలం నర్సక్కపల్లి గ్రామంలోనూ అభిమానులు, నాయకులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కేకులు కట్ చేసి స్వీట్లు పంచిపెడుతూ నాగుర్లపై ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవకుడు, రైతుల పక్షపాతిగా నిలుస్తున్న వెంకన్న రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## దుగ్గొండి మండల కేంద్రంలో

అక్షర దర్బార్, దుగ్గొండి : వరంగల్ జిల్లా ఆరె సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒలిగే నరసింగరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆరె సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను దుగ్గొండి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకినే రాజేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు గుండెకారి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు లాండె రమేష్, మాజీ ఎంపీటీసీ మోర్తాల రాజు, జిల్లా నాయకులు కుసుంబ రఘుపతి, మండల సీనియర్ నాయకులు జమలాపురం రాజేశ్వరరావు, లాండె బాబురావు, ఖాతరబాజీ చిరంజీవి, మోకిడె రాజేశ్వరరావు, యూత్ నాయకులు కోరికల ప్రశాంత్, మోర్తాల వర్షిత్, ఇటుకాల కిషన్, శోభన్ పాల్గొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్ ను కలిసిన నాగూర్ల

అక్షర దర్బార్, పరకాల: రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తన జన్మదినం సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నాగూర్ల వెంకటేశ్వర్లను కేసీఆర్, కేటీఆర్ లు శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కల్లపల్లి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.


పరకాలలో కేక్ కట్ చేస్తున్న ఫర్టిలైజర్ అసోసియేషన్


హాస్పిటల్ లో పండ్ల పంపిణీ


కుంకుమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

## హన్మకొండలో ఘనంగా వేడుకలు..

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు (నవత వెంకన్న) జన్మదిన వేడుకలు మంగళవారం హనుమకొండలో ఘనంగా జరిగాయి. ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా కమిటీ, ఆరె కుల విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కేక్ కట్ చేసి, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పేర్వాల లింగమూర్తి, కొల్లూరి కండె రావు, డాక్టర్ మోటె చిరంజీవి మాట్లాడుతూ.. నాగుర్ల వెంకన్న అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచే వ్యక్తి అని కొనియాడారు. ఉద్యమకారుడిగా ఎంతోమందికి వెన్నుదన్నుగా నిలిచిన ఆయన సేవలను గుర్తించి, రానున్న రాజ్యసభ ఎన్నికల్లో ఆయనకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లూరి కండె రావు, డా. మోటె



చిరంజీవి, బాబురావు, లోనే దీపక్, మారుజోడు నరసింహారావు, శివాజీ, నిరంజన్ రావు, చంద్రరావు, మనోహర్ రావు, రవీందర్, లడే శివ, కొలే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్షర దర్బార్, దుగ్గొండి: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేకంపల్లి గ్రామ సర్పంచ్ కొలుగూరి సుజాత సూచించారు. మంగళవారం రేకంపల్లి గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలాజీ, ఆరో వార్డు సభ్యుడు మట్టేవాడ రాజయ్య పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అక్షర దర్బార్,చిట్యాల/శాయంపేట : చిట్యాల మండలంలో మూడు నెలలు పైబడిన దూడలు, ఆవులు, గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి – అంతులు, వార్డు సభ్యుడు నవీన్ ప్రారంభించారు. చిట్యాల ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. జి. వెంకన్న మాట్లాడుతూ ఈ టీకాలు వేయడం వల్ల పశువులు వ్యాధి నుంచి రక్షణ పొందడంతో పాటు ఆరోగ్యంగా ఉండి పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. మండల పశువైద్యాధికారి డా. అజయ్ మాట్లాడుతూ చిట్యాల మండలంలో సుమారు 135 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మార్చి 10 నుంచి ఏప్రిల్ 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కవిత, దివ్య, కరుణాకర్, రాజేందర్




రెడ్డి, లక్ష్మణ్ మరియు రైతులు పాల్గొన్నారు.

## శాయంపేటలో..

శాయంపేట మండల ప్రాథమిక పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి ఎం. సునీల్ తెలిపారు. టీకాలు వేయడం



వల్ల పశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంతో పాటు ఉత్పత్తి, పెరుగుదల, ప్రత్యుత్పత్తి శక్తి మెరుగుపడి రైతులకు లాభదాయకంగా ఉంటుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఎల్ఓ రమేష్ బాబు, జెవివో రవి, బి.ఎ. సదానందం, రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, చిట్యాల: అడ్మిషన్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మీ చేతుల మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరకా ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వసతులు ఇతర సౌకర్యాల గురించి వివరించారు. త్వరలోనే కళాశాల నూతన భవన ప్రారంభోత్సవం జరగనున్నట్లు తెలిపారు. అడ్మిషన్ల కోసం సహకరిస్తామని సర్పంచ్ తౌటం లక్ష్మీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తౌటం నవీన్, అధ్యాపకులు డాక్టర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఆర్. ఈశ్వర య్య, డాక్టర్ జి. రాజేశ్వర్ కుమార్, డాక్టర్ డి. సంజయ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.




## చెట్ల ద్వారానే ప్రాణవాయువు

### : ఎంఈఓ రఘుపతి

అక్షర దర్బార్, చిట్యాల: చెట్ల ద్వారానే సమస్త జీవకోటికి ప్రాణవాయువు అందుతుందని ఎంఈవో కోడెపాక రఘుపతి సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలలో భాగంగా చిట్యాల ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ రఘుపతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి, బొమ్మ రాజమౌళి, సదయ్య, శ్రీనివాస్, శంకర్, ఉస్మాన్ అలీ, నీలిమా రెడ్డి, సరళాదేవి, కల్పన, విజయలక్ష్మి , సుజాత, బుజ్జమ్మ, సీఆర్‌పీ రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## బైక్ అదుపు తప్పి యువకుడు మృతి



అక్షర దర్బార్, దుగ్గొండి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామ శివారు మూల మలుపు వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామానికి చెందిన పోతరవేణి మనోహర్ (26) తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా తొగర్రాయి గ్రామ ఎస్సీ కాలనీ సమీపంలోని మూల మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బ్లాక్‌లో గ్యాస్..

- కమర్షియల్ సిలిండర్ కొరత
- మూతపడుతున్న హోటళ్లు
- గ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలకు ఇబ్బందులు



అక్షర దర్బార్,పరకాల: అంతర్జాతీయంగా కొనసాగుతున్న ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం స్థానికంగా కూడా కనిపిస్తోంది. చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో వంట గ్యాస్ (ఎల్పీజీ) ధరలు పెరగడంతో పాటు సరఫరాలో ఆలస్యం చోటుచేసుకుంటోంది. దీంతో పరకాల పట్టణంలో హోటల్ వ్యాపారులు, చిన్న కుటీర పరిశ్రమలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నా ఒకటి రెండు రోజుల్లో రావాల్సిన సిలిండర్లు ఆలస్యంగా అందుతున్నాయని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ విక్రయాలు

పరకాల పట్టణంలో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర అధికారికంగా రూ.985గా ఉన్నప్పటికీ, కొరత కారణంగా బ్లాక్ మార్కెట్‌లో రూ.1300 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతోంది. సరఫరా సక్రమంగా లేకపోవడంతో కొంతమంది వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కమర్షియల్ గ్యాస్ కొరతతో హోటళ్లకు కష్టాలు

హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఉపయోగించే 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు తాత్కాలికంగా గృహ వినియోగ గ్యాస్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల వ్యయాలు పెరిగి, చిన్న చిన్న హోటళ్లు మరియు టిఫిన్ సెంటర్లు ఇప్పటికే మూతపడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

### కార్మికులకు ఉపాధి భయం

హోటళ్లు, కుటీర పరిశ్రమలు మూతపడితే వాటిపై ఆధారపడి పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికే కొన్ని టిఫిన్ సెంటర్లు నిలిపివేయడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్

యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు సరఫరా ప్రభావితమై ధరలు పెరిగే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్యాస్ కొరత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్‌ను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావాలని, ధరలను నియంత్రించాలని వ్యాపారులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పరకాలలో సమస్యలు పరిష్కరించాలి

### మున్సిపల్ చైర్మన్ సునీల్ కు సీపీఎం వినతి పత్రం



అక్షర దర్బార్, పరకాల: పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ పట్టణంలోని సిఎస్ఐ స్కూల్ పక్కన పిడుగుబండకు వెళ్లే దారిలో వివిధ కులాలకు చెందిన స్మశానవాటిక ఉందని, అక్కడికి వెళ్లే రహదారి బాగుచేసి వెంటనే విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల, అక్కడ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న 15 కుటుంబాలకు రోడ్డు, వీధి లైట్లు, తాగునీటి కోసం వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శాంతి కుమార్, చేరాలు, బన్నీ, బోట్ల సునీత, చుక్క మానస, మడికొండ రవళి, స్రవంతి పాల్గొన్నారు. సిపిఎం నాయకులు హేమంత్ హాజరయ్యారు.

## నేల ఆరోగ్య పరిరక్షణకు రైతులు ముందుకు రావాలి




అక్షర దర్బార్, పరకాల: ఆత్మ పరకాల డివిజన్ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ రాములు హాజరై రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. రైతులు నేలకు అవసరమైన మేరకు మాత్రమే దున్నాలని, అధికంగా దున్నడం వల్ల నేలలో సేంద్రియ కార్బన్ తగ్గిపోతుందని తెలిపారు. పంటలలో ఎరువులను సిఫారసుల మేరకు సరైన విధంగా వినియోగించాలని సూచించారు. అలాగే పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియ దున్నడం వల్ల నేల సారవంతం పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే రబీ పంట అనంతరం రైతులు భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగా ఎరువులు వాడితే నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆర్థిక లాభం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ పరకాల కె. జగదీశ్వర్ రెడ్డి, ఏవో ఎస్. శ్రీనివాస్, ఏఈఓలు శైలజ, రజాక్, కాటంరాజ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.



## స్మశాన వాటికలో చెత్త తొలగింపు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో శ్మశాన వాటికను వార్డు మెంబర్ ప్రవీణ్ కుమార్, పిఏసిఏస్ మాజీ డైరెక్టర్ ప్రకాష్ లతో కలిసి గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య శుక్రవారం సందర్శించారు. స్మశాన వాటికలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రహించిన సర్పంచ్ వెంటనే జేసీబీ సహాయంతో చెత్తను తొలగించి చదును చేపించారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి

అక్షర దర్బార్, చిట్యాల : మహిళలు, శూద్రులు మరియు అణగారిన వర్గాలకు విద్యను అందిస్తూ వారి హక్కుల కోసం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, చింతల రమేష్, గోల్కొండ సురేష్, గురుకుంట్ల కిరణ్, గుర్రపు తిరుపతి, మ్యాదరి సునీల్, దాసరపు నరేష్, గడ్డం కొమురయ్య, దూడపాక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీని సందర్శించిన మంత్రి

▪ పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం



అక్షరదర్బార్, భీమదేవరపల్లి : భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులతో మాట్లాడిన ఆయన, వచ్చే నాలుగు రోజులు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తి శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పరిశీలించారు. భోజన నాణ్యత, వంటశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీ విద్యార్థులతో కలిసి మంత్రి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో సత్సంభాషణ జరిపి వారి చదువులు, వసతి సౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాసానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఈఓ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 12న శిక్షణ తరగతులు

- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు




అక్షరదర్బార్, భూపాలపల్లి : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి సీఎస్ రామక్రిష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, 12న నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా మార్చి 12న నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి సంబంధించి విభాగాల వారీగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతి అధికారుల నుండి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి , ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐలో చేరండి!

▪ మాజీ మావోయిస్టులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం.

▪ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

అక్షరదర్బార్, హైదరాబాద్ : మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని, ఆ విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంగళవారం పిలుపునిచ్చారు. ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్న మావోయిస్టులు రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని, అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. తుపాకీతో మార్పు సాధ్యం కాదని భావించి ప్రజాస్వామ్య పంథాలో పోరాడాలనుకునే వారికి తమ పార్టీ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఇటీవల అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డితో పాటు 130 మందికి పైగా మావోయిస్టులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వీరి పునరావాసం కోసం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరుతూనే, వారు రాజకీయాల్లోకి రావాలనుకుంటే సిపిఐ సిద్ధంగా ఉంటుందని సాంబశివరావు స్పష్టం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్ల కంటే ఇలా చర్చల ద్వారా, లొంగుబాట్ల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే సరైన మార్గమని అభిప్రాయపడ్డారు.

# 13న పీఎం కిసాన్ జమ

▪ ఈ కేవైసీ, ఆధార్ సీడింగ్ తప్పనిసరి

▪ పూర్తి చేయని రైతులు త్వరపడండి

అక్షరదర్బార్, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం దేశంలోని కోట్లాది మంది రైతులకు తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 22వ విడత నిధులను మార్చి 13న రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. గతంలో 21వ విడత నిధులను నవంబర్ 19న విడుదల చేయగా, ఇప్పుడు తాజా విడతను ప్రధాని నరేంద్ర మోదీ అస్సాంలోని గువహటి నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయనున్నారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో నగదు అందుతుండగా, ఈసారి సుమారు 9.32 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అయితే, ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయని వారికి, ఆధార్ సీడింగ్ లేని వారికి ఈ నిధులు జమ అయ్యే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రైతులు తమ పేమెంట్ స్టేటస్‌ను పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌లోని 'నో యువర్ స్టేటస్' ద్వారా తనిఖీ చేసుకోవచ్చు. గ్యాస్ ధరల పెరుగుదల, అప్పుల బాధతో రైతుల ఆత్మహత్యల వంటి వార్తల మధ్య కేంద్రం విడుదల చేస్తున్న ఈ రూ.2,000 నగదు రైతులకు కొంత ఊరటనిచ్చే అంశం.

# మొగుళ్ళపల్లి ఎస్సై అశోక్ బదిలీ

▪ నూతన ఎస్సైగా ఎం సురేష్ నియామకం




అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9 మంది పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ఐ)లు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వులు విడుదల చేశారు. మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్ గణపురం ఎస్ఐగా, టేకుమట్ల ఎస్సై డి సుధాకర్ రేగొండ ఎస్సైగా, చిట్యాల ఎస్ఐ జి శ్రావణ్ కుమార్ భూపాలపల్లి సెకండ్ ఎస్సైగా, గణపురం ఎస్ఐ ఆర్ అశోక్ మంగళవారం బదిలీ అయిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టారు,భూపాలపల్లి వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)కు, కొత్తపల్లి గోరి ఎస్సై ఎస్ దివ్య భూపాలపల్లి వీఆర్ ఎస్ ఐ గా, ప్రస్తుతం భూపాలపల్లి వీఆర్ లో ఉన్న ఎస్ ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి కొత్తపల్లిగోరి ఎస్సైగా, వీఆర్ లో ఉన్న ఎస్ఐ పి సతీష్ చిట్యాల ఎస్సైగా, ప్రస్తుతం ములుగులో వీఆర్ లో ఉన్న ఎస్సై ఎం సురేష్ మొగుళ్లపల్లి ఎస్సైగా నియమితులయ్యారు. మొగుళ్లపల్లి ఎస్సై ఎం సురేష్ మినహా మిగతా వాళ్ళందరూ బాధ్యతలు చేపట్టారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

▪ ఏసీపీలు రవీందర్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి

▪ డ్రగ్స్ రహిత సమాజంపై విద్యార్థులకు అవగాహన

అక్షర దర్బార్, దుగ్గొండి : దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని నర్సంపేట ఏసీపీలు పున్నం రవీందర్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం దుగ్గొండి మండలంలోని గిర్నీబావి మహాత్మజ్యోతి భాపూలే గురుకుల విద్యాలయం, నాచినపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, దుగ్గొండి జిల్లా పరిషత్ హైస్కూల్, వెంకటాపురం ఉన్నత పాఠశాలల్లో పిల్లల భద్రత, మత్తు పదార్థాలు మరియు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. చిన్ననాటి నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలు, క్రికెట్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ పై అవగాహన

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలో శాయంపేట, పత్తిపాక,కస్తూరిబా పాఠశాల,గట్లకనపర్తి గవర్నమెంట్ పాఠశాల, ఎంజెపి పాఠశాలలో ఈగల్ టెమ్ ఆద్వర్యంలో డ్రగ్స్ పై అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన, 1908 గురించి ప్రచారం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ టీం ఇన్ స్పెక్టర్ గోపి, శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్ఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915